

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

"**ఆమాటకొస్తే** ఆడికి నువ్వొక్కడే తండ్రివి కదా! ఆడు అక్కడ బాగా సెటిల్ అయి గ్రీన్‌కార్డొచ్చాక నిన్నూ, నీ పెళ్ళాన్నీ తీసుకెళతాడు కుదర్దంటాడా. డబ్బు పంపిస్తాడు. ఇక్కడే సుఖంగా సావచ్చు. ఇంక తగలపెట్టకుండా, పాతిపెడుతున్నారన్న భయం ఉండదు.

"నా కొడుకుల్ని ఇండియాకి రమ్మంటే ఆళ్ళేమంటారో తెలుసా? 'నాన్నా! నాకు ఏసీ కారిత్తావు, ఏ.సీ ఇల్లిత్తావు, పోనిత్తావు, ఫ్రిజ్జిత్తావు. అన్నీ ఇత్తావు నేను నా యింట్లో ఉన్నంతవరకే అమెరికాలోలా బతగ్గలను.

ఇల్లుదాటి రోడ్డుమీదకి వచ్చాక అమెరికాలో దొరికే ఏం సౌకర్యాలిత్తావు? అమెరికాలోలా మంచిరోడ్లిత్తావా? కల్తీలేని భోజనం ఇత్తావా? దోమలు, దుమ్మూ లేని వాతావరణం ఇత్తావా? సూడటానికి పచ్చటి లానిత్తావా? శనాదారాలు యెళ్ళడానికి నేషనల్ పార్క్‌లిత్తావా? ఏం ఇత్తావు? ఏం ఇవ్వలేవు. అంసేత నేను ఇండియా రానుపొమ్మంటున్నారు.

"నన్నడిగితే మనకిక్కడ డబ్బు తప్ప సుఖం లేదయ్యా! కొందరికి ఈ రెండూ కూడా లేవు. అక్కడ ఆ రెండూ ఉన్నాయ్. నా రెండో కొడుకన్నట్టు మనదేశంలో ఇంటికాడ ఉంటేనే లక్షాధికారి, బజారెళ్తే రిక్షావాడు, లక్షాధికారి అంతా ఒక్కటే. అమెరికాలో రిక్షావాడు అయినాసరే, బజారెళ్తే ఇక్కడి కోటీశ్వరుడికన్నా దర్జా సౌకర్యాలున్నాయి. నా మాటిని మీవోడ్ని అమెరికా పంపేసెయ్. లేదంటావా. నీ తుక్కు వ్యాపారంలో నీలాగే మగ్గనీ. ఎందుకు సెప్పానో యోసించుకో!"

విఠల్ ఆ కాంట్రాక్టర్ చెప్పింది విన్నాక ముకుందాన్ని అమెరికా పంపించాలని నిర్ణయించుకున్నాడు.

21

ఉదయం పరిగెత్తుకొచ్చాడు బాపన్న.

అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో భూకంపం వచ్చింది. ముప్పై రెండు మంది పోయారట. వాణి ఉండేది కాలిఫోర్నియాలోనే కదా!" అడిగాడు.

ముకుందం గుండె క్షణకాలం కొట్టుకోవడం ఆగింది. ఆ పేపర్ అందుకున్నాడు.

"లాస్ఏంజెల్స్" నగరంలో తెల్లవారుజామున 4.31 గంటలకి (భారత కాలమాన ప్రకారం సోమవారం సాయంత్రం 6.01 గంటలకి) వచ్చిన పెనుభూకంపంలో ముప్పై రెండుమంది మరణించారని వందలాది మంది గాయపడ్డారని భారత సంతతి కుటుంబాలు నివసించే ప్రాంతాల్లో ఈ భూకంపం తీవ్రస్థాయిలో విధ్వంసాన్ని సృష్టించిందని భూకంపం తర్వాత ఆఫ్టర్ షాక్స్‌గా పేర్కొనబడే ప్రకంపనాలు రెండువందల సార్లకి పైగా వచ్చాయని రిక్టెర్ స్కేలు మీద భూకంపం 6.6పాయింట్లుగా నమోదయిందని రాశారు.

భూకంపం వల్ల వందల ప్రాంతాలలో మంటలు లేచాయని లాస్‌ఏంజెల్స్‌కి ముప్పైరెండు కిలోమీటర్ల దూరంలో వాయువ్య దిశలో ఉన్న శాన్‌ఫెర్నాండో లోయ ఈ భూకంపానికి కేంద్రమని, అక్కడ నివసించే ముప్పైవేలకి పైగా భారతీయ కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని కూడా చదివాడు.

బెపరిమ తెలుగు అసోసియేషన్ వాళ్ళు నిర్వహించే ఓ కార్యక్రమంలోని నాటకంలో పావని చిన్నపాత్ర వేస్తోంది. ఆ డైలాగ్స్‌ను రిహార్సల్స్ చేస్తోంది.

"ఆ సంగతి వినగానే నా మనసు, తల ఢిల్లీ పోయింది. ఆ సంగతి వినగానే నా మనసు తల ఢిల్లీ పోయింది. ఆ సంగతి.."

"ఆపాపు, ఏమిటా డైలాగు తలా తోకా లేకుండా?" లక్ష్మి పావని చేతిలోని పేపర్‌ని అందుకుంది. తెలుగు భాషని ఇంగ్లీషు ఆల్ఫాబెట్స్‌లో రాసుకుని చదువుతోంది పావని డైలాగ్స్.

లక్ష్మి తెలుగ్ స్క్రిప్ట్ అందుకుని ఆ డైలాగ్ చదివి చెప్పింది.

"మహాతల్లీ మనసు తల ఢిల్లీపోయింది కాదే ఆ సంగతి విని నా మనసు తల్లడిల్లిపోయింది కరెక్ట్. మనసు తల్లడిల్లిపోవడం అంటే ఏమిటో తెలుసా?" అడిగింది. "తెలీదు"

"మై హార్ట్ ఏజిటేటెడ్ అని."

తొలిసారిగా ఇంటర్నేషనల్ టెలిఫోన్ కాల్‌చేశాడు ముకుందం. అమెరికా దేశపు కోడ్ అయిన 001. సేనోజే ఏరియా కోడ్ అయిన 408, వెంకటేశ్వరరావు ఇంటి నంబరయిన 436-1850 తిప్పాడు.

కొద్ది క్షణాల తర్వాత అవతల ఫోను మోగిన శబ్దం వినిపించింది.

మూడోసారి మోగాక ఎవరో ఎత్తారు.

"హలో?" వినిపించిందో ఆడ కంఠం.

"వాణి ఉందాండి? రాజమండ్రి నుంచి నా పేరు ముకుందం."

కొద్ది క్షణాల తర్వాత వాణి కంఠం వినిపించింది.

"హలో? ముకుందం?"

"నేనే.. ఇప్పుడే చూశాను మీ రాష్ట్రంలో భూకంపం వచ్చిందని. నువ్వెలా వున్నావో తెలుసుకుందామని ఫోను చేశాను."

"ఓ థాంక్స్! ఇక్కడ మాకేం కాలేదు. వి ఆర్ సేఫ్."

ముకుందం కంఠంలోని ఆదుర్దాని గుర్తించింది వాణి.. చెప్పింది.

"అది తెలుసుకోవాలనే ఫోను చేశాను. మొన్న నీ ఉత్తరం అందింది. మీ ఊళ్ళో భూకంపాలెక్కువని అందులో రాశావుగా. దాంతో భయంవేసి ఫోను చేశాను."

"ఓ.కే. వి ఆర్ జస్ట్ ఫైన్ - ముకుంద్ ఐ లవ్ యూ..." చెప్పింది వాణి.

"ఐ లవ్ యూ వాణీ!" చెప్పాడు ముకుందం కూడా.

"నేనంటే నీకెందుకంత ప్రేమ?" అడిగింది వాణి.

"ఎందుకంటే, అందాన్ని క్షణాల్లో కొలుస్తే నీ అందం విలువ ఓ సంవత్సరం కాబట్టి."

వాణి బుగ్గల్లోకి ఆ మాటలకి వెచ్చటి ఆవిరి ప్రవేశించింది.

"థాంక్యూ ఫర్ ది కాంప్లిమెంట్" చెప్పింది.

"ఎందుకు నిన్ను ప్రేమిస్తున్నానంటే, నీవు నా గుండె గది తాళం చెవి దొంగిలించావు కాబట్టి. నా ఇంటి తాళం చెవి కూడా నువే సొంతం చేసుకోవాలని."

"ముకుంద్.. థాంక్‌యూ.." చెప్పింది వాణి మనస్ఫూర్తిగా.

"నీవు ప్రపంచంలో సుందరివై వుండి కూడా ఆ అందాల పోటీలో పాల్గొనవెందుకు?"

వాణికి ఈసారి సిగ్గు ముంచుకొచ్చింది.

"వాణీ! ఐ లవ్ యూ! నిన్ను పెళ్ళి చేసుకోలేకపోతే నేను చచ్చిపోతాను తెలుసా?"

"ముకుంద్ నేను నిన్ను చావనివ్వను తెలుసా!"

"పెట్టేస్తున్నాను."

"ఓ.కే ఎప్పుడయినా కాల్చేస్తుండు" చెప్పింది.

"అలాగే. కానీ ఎవర్ని కాల్చెయ్యాలి?" అడిగాడు ముకుందం.

ఫక్కున నవ్వింది వాణి.

"కాల్ చేయడం అంటే ఫోను చేయడం అని అర్థం అమెరికన్ ఇంగ్లీషులో నేను ఎప్పుడయినా నిన్ను పిలుస్తూంటాలే పిలవడం అంటే ఫోన్ చేయడం అని అర్థం బై"

"నువ్వెంతో అందంగా నవ్వగలవు వాణీ. ఏదీ యింకోసారి నవ్వు."

"నవ్వు రావడంలేదు. ఉండు ట్రై చేస్తాను. అగ్గిరాముడు. తుప్పుపట్టిన వాటర్ టాంక్ లారీ మోకాలు" ఫక్కున నవ్వింది వాణి మళ్ళీ.

అప్పుడు ఆ గదిలోకి వచ్చింది వాణి తల్లి.

"నువ్వింకా ఆ నీలం రంగు తెల్ల చుక్కల బుష్ కోట్ వేసుకుంటున్నావా?"

"అవును. ఏం?"

"అది వేసుకుంటే నీవు డిమ్‌విట్‌లా వుంటావు. వద్దు."

మళ్ళీ ఫక్కున నవ్వింది వాణి.

"అలాగే ఇవాళే చింపేస్తాను."

"గుడ్‌బై ముకుంద్"

"బై వాణీ"

వాణి ఫోను పెట్టేసాక ఇంటర్నేషనల్ సేటిలైట్ కనెక్షన్ కట్ అయిపోయింది.

"ఎవరది?" అడిగింది లక్ష్మి.

"ముకుందం అని తాతయ్య ఫ్రెండ్ కొడుకు. రాజమండ్రినుంచి. భూకంపం వచ్చింది కదా. ఎలా ఉన్నానో తెలుసుకుందామని ఫోన్ చేశాడు."

"అసలతనెందుకు నీకిన్ని ఉత్తరాలు రాయాలి?" ఫోను చెయ్యాలి అడిగింది లక్ష్మి తల్లి తీవ్రంగా చూస్తూ.

"ఓ... మమ్. డోంట్ యూ స్టార్ట్ దట్ అగైన్."

కాంట్రాక్టర్లతో మాట్లాడాక విఠల్ ఆయన చెప్పిన విషయాలన్నీ తన భార్యకి వివరించాడు.

"నువ్వేమంటావ్?" అడిగాడు.

"మన జీవితంలో ముప్పాతిక వంతుకి పైగా గడిచిపోయింది. కాని వాడి జీవితంలో పావు వంతే అయింది. వాడి మిగిలిన జీవితం ఆనందంగా గడిస్తే అది మనకు ఆనందం కాదా? వాడు మనకు సంపాదించి పెడితే కానీ గడవదన్న బాధలేదుగా. ఇండియాలోనే వున్నా ఏ భిలాయ్‌లోనో, కలకత్తాలోనో ఉద్యోగం వస్తే మాత్రం మన దగ్గర ఉంటాడా?"

విఠల్ ముకుందాన్ని అమెరికాకు పై చదువులకు పంపడానికి నిశ్చయించుకున్నాడు.

జి.మేట్‌కి టోఫిల్‌కి శిక్షణ ఇచ్చే ఇన్‌స్టిట్యూట్‌లో చేరాడు ముకుందం.

బాపన్న ఒకసారి వెళ్ళి ఫెయిలయి రెండోసారి హాజరవుతున్నాడు. కాబట్టి అతను ముకుందాన్ని చక్కగా గైడ్ చేయగలిగాడు.

"ఈ పరీక్ష సెంటర్ రాజమండ్రిలో లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం సికింద్రాబాద్‌లోనే వుంది. కానీ మద్రాసు యు.ఎస్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌ని మనం సెంటర్‌గా తీసుకోవడం మంచిది" చెప్పాడు బాపన్న.

"ఏం?"

"అమెరికన్ ఏక్సెంట్‌లో కేసెట్‌లోంచి వినిపించే సంభాషణ విని మనం సమాధానం రాయాల్సి ఉంటుంది. దీన్ని 'లీజనింగ్ కాంప్రెహెన్షన్ టెస్ట్' అంటారు. మద్రాసులోని ఆ ఫౌండేషన్‌లో సౌండ్ సిస్టంబావుంటుంది కాబట్టి మిగిలిన చోట్లకన్నా అక్కడ రాసేవాళ్ళకి ఎక్కువ మార్కులు వస్తూంటాయి."

"లిజనింగ్ కాంప్రెహెన్షన్ అంటే?" అడిగాడు ముకుందం.

"ఓ స్టేట్‌మెంట్‌ని మనం వింటాం. అదీ ఒక్కసారే. విన్నాక ఆన్సర్ పేపర్‌లోని నాలుగు సమాధానాలు చదివి అందులో ఏది మనంవిన్న స్టేట్‌మెంట్‌కి దగ్గరగా ఉందో రాయాలి. ఉదాహరణకి ఓ వాయిస్ చెపుతుంది. 'క్రిస్టమస్ సేల్‌లో' ఇరవై డాలర్లకు బహుమతిగా ఓ హౌస్ కోట్ కొనడానికి వెళితే స్కార్ఫ్ రెండు డాలర్లు సేవ్ అయ్యాయని వినిపించిందనుకో, ఏ,బి,సి,డి ల ఎదురుగా నాలుగు స్టేట్‌మెంట్స్ ఉంటాయి.

ఏ ఎదురుగా స్కార్ఫ్ ఖరీదు 20డాలర్లని, బి ఎదురుగా కోటు ఖరీదు 18డాలర్లని, సి ఎదురుగా హౌస్‌కోట్ కొనడానికి వెళ్ళి స్కార్ఫ్ కొన్నదని, డి ఎదురుగా స్కార్ఫ్ కొనకుండా 18 డాలర్లు సేవ్ చేసిందని - దీంట్లో ఏది కరెక్టో అది టిక్ చెయ్యాలి. సి కరెక్టన్నమాట.

"పార్ట్ ఎ లో ఇలాంటి ఇరవయ్ ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. పార్ట్ బి లో ఇద్దరి మధ్య సంభాషణ వినిపిస్తుంది. చివర్లో ఇంకో గొంతు దానికి సంబంధించిన ఓ ప్రశ్న వేస్తుంది. ఆన్సర్ పేపర్లోని నాలుగు సమాధానాల్లో ఆ ప్రశ్నకు సరయిన సమాధానం ఏదో టిక్ చేయాలి.

ఉదాహరణకు డల్లాస్‌కు రైలు టికెట్ ఎంత, ఎప్పుడు రైలు బయలుదేరుతుంది, ఎప్పుడు చేరుతుంది, మధ్యలో స్టేషన్స్ ఏమిటి అన్నది ఆ సంభాషణలో ఉందనుకో. ఆ సంభాషణ ఎక్కడ జరిగిందని అడుగుతుంది మూడో కంఠం. సమాధానాలలో లైబ్రరి, సినిమా థియేటర్, డ్రాయింగ్ హాల్, రైల్వేస్టేషన్ అని వుంటే నీ సమాధానమేమిటి?"

"రైల్వే స్టేషన్‌లోని ఎంక్వయిరీ కౌంటర్ దగ్గరని."

"కాబట్టి రైల్వే స్టేషన్ ముందుండే 'సి' సమాధానంగా టిక్ చేయాలి. అలాగే పార్ట్ సి లో సంభాషణ విని అడిగిన ప్రశ్నకి సమాధానం ఇదే పద్ధతిలో రాయాలి."

"సింపుల్‌గా ఉంది."

"అమెరికన్ వాళ్ళ ఉచ్చారణని అర్థం చేసుకోగలిగితే సింపుల్. అక్కడే ఉంది ఈ కష్టమంతా. కోచింగ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో కేసెట్లు ప్లే చేస్తారు. అనేకసార్లు వినడం ద్వారా మనకి వాళ్ళ ఏక్సెంట్ పట్టుపడుతుంది."

"ఇంకా?"

"ఇంకా స్ట్రక్చర్ అండ్ రిటన్ ఇంగ్లీష్ అనే టెస్ట్ ఉంటుంది. ఇరవై అయిదు నిముషాల్లో నలభై ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. గ్రామర్ బాగా వచ్చినవాళ్ళకి ఇది సులభం. ఓ ఇంగ్లీష్ వాక్యం ఇచ్చి ఓ చోట బ్లాంక్ ఇస్తారు. కింద వున్న నాలుగు సమాధానాల్లో ఏది కరెక్టో అది రాయాలి. నో, నెవర్, నాట్, నన్‌లో ఏది అక్కడ అమరుతుందో తెలుసుకుంటే చాలు. అన్నీ ఇలాంటివే. ఆ టెస్ట్ పేపర్‌లోనే ఇంకో భాగం, ఓ వాక్యంలోని నాలుగు మాటల కింద నాలుగు గీతలు గీస్తారు. అందులో ఏ గీత కిందమాట గ్రేమెటికల్‌గా తప్పో కనుక్కుని రాయాలి. ఒకాబులరి అండ్ రీడింగ్ కాంప్రెహెన్షన్ పేపర్ కూడా ఉంటుంది. ఓ వాక్యంలోని ఓ పదం అండర్ లైన్ చేసి ఉంటుంది. సమాధానంలోని నాలుగు మాటల్లో ఏది ఆ అండర్‌లైన్ చేసిన పదం ప్లేస్‌లో కుదురుతుందో సమాధానం రాయాలి."

"జి. మేట్ అంటే?" అడిగాడు ముకుందం.

"జి. మేట్ అనేది జనరల్ మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌కు షార్ట్ ఫాం. ఇందులో కూడా ఇంగ్లీష్ సెంటెన్సెస్‌ని కరెక్ట్ చేసే పేపర్ ఒకటుంటుంది. ఇంకో పేపర్ క్రిటికల్ రీజనింగ్. ఓ స్టేట్‌మెంట్ చదివి దాన్ని బట్టి కింద నాలుగు సమాధానాల్లో ఏది కరెక్టో అది రాయాలి"

బాపన్న ఓ ప్రాబ్లం చూపించి దాన్ని సాల్వ్ చేయమన్నాడు ముకుందాన్ని.

"ఈ కేబినెట్‌ని 1975 తర్వాత చేసి వుంటే, ఇది రెడ్‌వుడ్ తో కేబినెట్ కాదు"

(ఎ) 1975 తరువాత చేసిన కేబినెట్‌లు అన్నీ రెడ్‌వుడ్‌తో చేసి

(బి) 1975లో కాని, అంతకు మునుపు కాని చేసిన కేబినెట్స్ రెడ్‌వుడ్‌తో చేసినవి.

(సి) రెడ్‌వుడ్ కేబినెట్స్ 1975లో కాని అంతకు మునుపు కాని చేయబడ్డాయి.

(డి) 1975లో కాని, అంతకుమునుపు కాని చేసిన కేబినెట్స్ ఏవీ రెడ్‌వుడ్‌తో చేయబడలేదు.

(ఇ) 1975 తరువాత చేసిన కేబినెట్స్ రెడ్‌వుడ్ తో చేసినవి కావు.

"ఇ కరెక్ట్" చెప్పాడు ముకుందం ఆ ప్రశ్నను అర్థం చేసుకుని.

"కరెక్ట్. ఈ పేపరులో తేలిగ్గా పాసవుతావు. ఇంకోటి డేటాసఫీషియెన్సీ పేపరు. లెక్కలకు సంబంధించిన ఓ ప్రశ్న ఇస్తారు. సమాధానాలుగా కింద వాళ్ళే రెండు స్టేట్‌మెంట్స్ ఇస్తారు. కింద ఇచ్చిన స్టేట్‌మెంట్స్‌ని స్టడీ చేసి సమాధానం ఇవ్వాలి. మొదటి స్టేట్‌మెంట్ ఒక్కటే సమాధానం తెలుసుకోవడానికి సరిపోవచ్చు లేదా రెండు స్టేట్‌మెంట్స్‌లోని సమాచారం అసలు సమాధానానికి సరిపోకపోవచ్చు. ఆ అయిదు ఛాయిస్‌లలో ఏది కరెక్టో సమాధానం రాస్తే చాలు. ఇంకోటి ప్రాబ్లం సాల్వింగ్ పేపరు. దీనికి కాలమూ, పని, లాభనష్టాలు, వడ్డీ, ఆల్జీబ్రా - ఇలాంటి సింపుల్ మేథ్స్‌కి సమబంధించిన ప్రశ్నలే ఉంటాయి."

ముకుందం బాపన్న దగ్గరున్న మోడల్ టెస్ట్ పేపర్సు కొన్ని తిరగేసి చూసాడు. అతనికి అది తేలికగా అనిపించి మొదటిసారే పాసవగలననే ధైర్యం కూడా కలిగింది.

"ఇంకో సంగతి. పరీక్ష శుక్రవారం కానీ లేదా శనివారం కానీ రాయొచ్చు. ఏ రోజు రాయాలో అప్లికేషన్‌లో పేర్కొనాలి. అలాగే టోఫెల్, జి.మేట్ ఒకేరోజు రాస్తామా లేక రెండు రోజులు రాస్తామా అన్నది కూడా మెన్షన్ చేయాలి. మనం కోరుకున్న సెంటర్‌లో ఖాళీ

లేకపోతే, తర్వాత్ రెండు సెంటర్ల ఛాయిస్ కూడా ఇవ్వాలి. బొంబే, ఢిల్లీ కలకత్తాల్లో కూడా సౌండ్ సిస్టం బావుంటుంది కాబట్టి అవి ఇస్తే బెటర్.''

ముకుందం రిజిస్ట్రేషన్ ఫారం నింపాడు. మద్రాసులో సెప్టెంబర్ 9, శనివారం నాడు జరిగే పరీక్షకి 41 డాలర్లకి సరిపడే డబ్బు పంపాడు.

మార్కెట్లో దొరికే టోఫెల్ కేసెట్స్, ఆన్సర్ పేపర్స్‌కొని అవి వింటూ సమాధానాలు పెన్సిల్‌తో టిక్ చేయసాగాడు. అలా కష్టపడి తనకు ఎన్ని మార్కులు వచ్చాయో చూసుకున్నాడు. తర్వాత రబ్బర్‌తో సమాధానాలు తుడిపేయసాగాడు. రోజూ స్టార్ టీవీలోని 'సాంటాబార్బారా' సీరియల్‌ని చూడసాగాడు అమెరికన్ ఏక్సెంట్‌ని నేర్చుకోవడానికి.

ముకుందం వాణితో ఫోన్‌లో మాట్లాడిన మూడు వారాలకి వాణి నుంచి రిజిస్టర్ పార్శిల్‌లో బఫర్ కవర్ ఒకటి వచ్చింది. సంతకం చేసిదాన్ని అందుకుని విప్పదీశాడు ఏం పంపి ఉంటుందా అనుకుంటూ.

రెండు ఫుల్‌హేండ్ షర్ట్స్ పంపించింది. ఒకటి నిలువు గీతలది. మరొకటి చెక్స్‌ది.

**''టు మై డియరెస్ట్ డిమ్‌విట్''** అని వాణి రాసిన కార్డు తప్ప ఇంకే ఉత్తరం లేదు అందులో.

ముకుందానికి అవి అతికినట్లుగా సరిపోయాయి, టెలిగ్రాఫ్ ఆఫీస్‌కి వెళ్ళి వాణికి కేబుల్ గ్రాం పంపించాడు.

''థాంక్స్. ఈ వారం 'ఆంధ్రప్రభ వీక్లీ' కవర్ పేజీమీద ఫోటో నీదేనా?

**విత్‌లవ్**

**డిమ్‌విట్''**

Post your comments

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in